క్లుప్తంగా

ప్రధానిని కలిసిన పారా గేమ్స్ పతకాల విజేత



ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి గ్రూప్ ఫొటోలో ఉన్న ఇంటర్నేషనల్ స్విమ్మర్ రవి కార్తీక్ బుడిగిన (పతకాలు ధరించిన విజేత)

జంగారెడ్డిగూడెం (బుట్టాయగూడెం) : జపాన్‌లో జరిగిన ఆసియా పారా గేమ్స్ స్విమ్మింగ్ పోటీల్లో మూడు పతకాలు సాధించిన జంగారెడ్డిగూడెం వాసి, ఇంటర్నేషనల్ స్విమ్మర్ రవికార్తీక్ బుడిగినకు అరుదైన గౌరవం లభించింది. సీనియర్ న్యాయవాది బుడిగిన నాగేంద్రకుమార్ తనయుడైన కార్తీక్.. దేశ ప్రధాని నుంచి ప్రత్యేక ఆహ్వానం అందుకొని ఢిల్లీలో మోదీని అధికారికంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆయనతో ముచ్చటించి, విజయాల విశేషాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో జరిగే ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్ వంటి అంతర్జాతీయ పోటీల్లోనూ ఇలాగే రాణించి దేశానికి మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

భీమవరంలో పునుగు పిల్లుల పట్టివేత



సర్వారాయుడు నివాసంలో పట్టుకున్న పునుగు పిల్లులు

భీమవరం: పట్టణంలోని ఓ ఇంట్లో హల్‌చల్ చేస్తున్న రెండు పునుగుపిల్లులను శుక్రవారం అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. స్థానిక పోలీసు బొమ్మ సెంటర్‌లోని ఎస్.సర్వారాయుడు నివాసంలో కొంతకాలంగా ఇవి సంచరిస్తున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ప్రత్యేక బృందం.. శుక్రవారం ఆ రెండు పిల్లులను పట్టుకుని బోనులో బంధించింది. వాటిని సురక్షితంగా అడవిలో వదులుతామని అధికారులు తెలిపారు.

20 కిలోల భారీ చేప.. రూ.7 వేలు



జాలర్లకు చిక్కిన 20 కేజీల చేపను బాగు చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం(బుట్టాయగూడెం): జంగారెడ్డిగూడెం మండలం వేగవరం సమీపంలోని జల్లేరు ఎర్రకాలువలో మత్స్యకారుల వలకు సుమారు 20 కిలోల బరువైన భారీ చేప చిక్కింది. అసాధారణ పరిమాణంలో ఉన్న ఈ చేప స్థానికంగా అందరి దృష్టిని విపరీతంగా ఆకర్షించింది. వేగవరం గ్రామానికి చెందిన కొబ్బరికాయల వ్యాపారి, రైతు గంటికూటి చిన్న దీనిని రూ. 7 వేలకు కొనుగోలు చేశారు. ఎర్రకాలువలో ఇంతటి భారీ సైజులో చేప లభించడంపై స్థానికులు, మత్స్యకారులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

వణికిస్తున్న వెంకయ్య వయ్యేరు

- ఎర్రకాలువ ప్రవాహ తీవ్రతకు సమీప గ్రామాల్లో గుబులు
- ప్రమాదకర స్థాయిలో దువ్వ రెగ్యులేటర్
- సామర్థ్యానికి మించి వరద నీటి ప్రవాహం



దువ్వలో ప్రమాదకరంగా నీటి ప్రవాహంతో వయ్యేరు



వరద నీటికి రోడ్డు, పంట పొలాలు ఏకమైన దృశ్యం



ఉధృతంగా ప్రవహిస్తున్న యనమదుర్రు కాలువ



మిరామియా కోడు పొంగుతుండంతో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు



దుర్గాపురంలో వీధుల్లోని నీటిని ఆయిల్ ఇంజిన్‌తో బయటకు తోడుతున్న దృశ్యం

తణుకు అర్బన్ : ఎర్రకాలువ ఉగ్రరూపం దాల్చడంతో వస్తున్న భారీ వరద నీటి తాకిడికి తణుకు మండలం దువ్వ వయ్యేరు తీవ్రంగా వణికిపోతోంది. దువ్వతోపాటు కోనాల, ముద్దాపురం గ్రామాల్లో వరద తీవ్రత ఏ స్థాయిలో ఉంటుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా దువ్వ రెగ్యులేటర్ పరిస్థితి ప్రమాదకరంగా మారింది. రెగ్యులేటర్ సామర్థ్య ఎత్తు 15 అడుగులు కాగా, ఇప్పటికే ఆ నీటిమట్టం దాటిపోవడంతో ఉన్న నాలుగు గేట్లను ఎత్తివేశారు. 16,500 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న ఈ రెగ్యులేటర్ గుండా ప్రస్తుతం 22,600 క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో బ్రిటిస్ కాలంలో నిర్మించిన ఈ రెగ్యులేటర్ ఏమవుతుందోనని గ్రామస్తులు, అధికారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో 23 వేల క్యూసెక్కుల ప్రవాహం వచ్చినప్పటికీ, నాటితో పోలిస్తే ఇప్పుడు రెగ్యులేటర్‌లో నాణ్యత దెబ్బతిందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇది ధ్వంసమైతే దువ్వతో పాటు పలు గ్రామాల్లోని ఇళ్లు జలమయమయ్యే ప్రమాదం పొంచి ఉంది.

ముంపు బారిన గ్రామాలు.. రోడ్డున పడ్డ కుటుంబాలు

ఎర్రకాలువ ఉధృతికి పలుచోట్ల గండ్లు పడటంతో తాడేపల్లిగూడెం మండలంలోని నందమూరు, మారంపల్లి, ఆరుళ్ల.. తణుకు మండలం దువ్వ, కోనాల, ముద్దాపురం గ్రామాల్లోకి వరద నీరు చేరి పంట పొలాలు మునిగిపోయాయి. దువ్వ వయ్యేరును ఆనుకుని గుడిసెలు వేసుకుని నివసించే 50కి పైగా నిరుపేద కుటుంబాలు రోడ్డున పడ్డాయి. గుడిసెల్లోకి నీరు చేరడంతో వారంతా రోడ్డు పక్కనే గుడారాలు వేసుకుని తలదాచుకుంటున్నారు. ఎగువన కొంగువారిగూడెం జలాశయం నుంచి వేలాది క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తుండటంతో ఈ పరిస్థితి తలెత్తింది. అయితే శనివారం సాయంత్రం నాటికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టవచ్చని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

భీమవరానికి పొంచి ఉన్న ముంపు ముప్పు

భీమవరం : పట్టణ మధ్య నుంచి ప్రవహిస్తున్న యనమదుర్రు కాలువ ప్రవాహం ఉధృతి పెరగడంతో పట్టణ వాసుల్లో ముంపు భయం పట్టుకుంది. గత పది రోజులుగా అర్నబ్, మురసు తుపాన్ల కారణంగా కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోని పలు పల్లపు ప్రాంతాలు జలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బట్లు పడ్డారు. ప్రస్తుతం వర్షాలు తగ్గినప్పటికీ యనమదుర్రు కాలువలో నీటి మట్టం రోజు రోజుకూ పెరుగుతుండటంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. పల్లపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు.

దుర్గాపురం, మెంటేవారితోటలో తీవ్ర ఇబ్బందులు

కాలువలో నీటి ప్రవాహం తీవ్రం కావడంతో మెంటేవారితోట, దుర్గాపురం ప్రాంతాల్లో నీరు ఎగదన్ని ఇళ్లలోకి చేరింది. మెంటేవారితోటలోని మిరామియా కోడు మురుగునీరు యనమదుర్రు కాలువలో కలవాల్సి ఉండగా, కాలువ ఉధృతి కారణంగా గట్టుపై నుంచి మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో కోడు ఇరువైపులా ఉన్న రోడ్లు జలమయమై ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. దుర్గాపురంలోనూ డ్రెయినేజీలు ఎగదన్ని ఇళ్ల మధ్య నీరు నిలిచిపోయింది. పలుచోట్ల ఆయిల్ ఇంజిన్ల ద్వారా నీటిని కాలువలోకి తోడుతున్నప్పటికీ మురుగు సమస్య పూర్తిగా తొలగలేదు.

గండ్లు పడే ప్రమాదంపై ఆందోళన

ప్రస్తుత నీటి ఉధృతికి యనమదుర్రు కాలువ గట్లు అంచుల వరకు నీరు ప్రవహిస్తోంది. ప్రవాహం మరింత పెరిగితే గట్లు తెగిపోయే ప్రమాదముందని, దీనివల్ల పట్టణానికి పెనుముప్పు వాటిల్లుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కోతకు గురైన శివపురం–చిన్నంపేట వంతెన




భారీ వరదకు శివపురం-చిన్నంపేట గ్రామాల మధ్య తమ్మిలేరు కాలువపై వంతెనకు గండి పడిన దృశ్యం

చింతలపూడి: మురసు తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు సరిహద్దు ప్రాంతాల్లో తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ఎగువన ఉన్న తెలంగాణ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు పోటెత్తడంతో శివపురం – చిన్నంపేట గ్రామాల మధ్య ఉన్న ప్రధాన వంతెన కోతకు గురైంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలోని బేతుపల్లి చెరువు అలుగు పారి దాదాపు 18 వేల క్యూసెక్కుల మేర వరద నీరు ఉధతంగా ప్రవహించడంతో ఈ వంతెన వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. వరద పోటెత్తిన సమయంలో అప్రమత్తమైన అధికారులు ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందుజాగ్రత్త చర్యగా రెండు రోజుల పాటు రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ప్రస్తుతం వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు, వంతెన సమీప భాగం తీవ్రంగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. ఈ మార్గంలో రాకపోకలు స్తంభించడంతో గత మూడు రోజులుగా రెండు జిల్లాల పరిధిలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యావసరాలు, అత్యవసర వైద్య సేవల కోసం కిలోమీటర్ల మేర ప్రత్యామ్నాయ మార్గాల్లో చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తోంది. అధికారులు వెంటనే స్పందించి యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు పూర్తి చేసి, రాకపోకలను త్వరితగతిన పునరుద్ధరించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఏజెన్సీలో దంచికొట్టిన భారీ వర్షం

జలాశయాల్లోకి భారీగా చేరిన వరద నీరు



బుట్టాయగూడెం మండలం జల్లేరు జలాశయంలోకి భారీగా వరద నీరు చేరుతున్న దృశ్యం

బుట్టాయగూడెం : ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం దంచికొట్టింది. ఇటీవల ।మురసు₹ తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు నేలంతా ఇప్పటికే తడిసి ముద్దవ్వడంతో, శుక్రవారం కురిసిన వర్షానికి వాగులు, పిల్ల కాలువలు పొంగిపొర్లాయి. కొండ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి గుబ్బలమంగమ్మతల్లి జల్లేరు జలాశయంలోకి నిరంతరం వరద నీరు వచ్చి చేరుతోంది. నీటిమట్టం పెరుగుతుండటంతో ఇరిగేషన్ అధికారులు రెండు గేట్లు ఎత్తి, స్లూయిజ్ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఏఈ సురేష్ తెలిపారు. ఈ జలాశయం పూర్తి సామర్థ్యం 217.80 మీటర్లు కాగా, ప్రస్తుతం 216.95 మీటర్ల నీటిమట్టం నమోదైంది. ప్రాజెక్టులోకి 208 క్యూసెక్కుల ఇన్–ఫ్లో వస్తుండగా, ఔట్–ఫ్లో 300 క్యూసెక్కులుగా ఉందన్నారు. మరో వైపు పొగొండ రిజర్వాయర్‌కు కూడా భారీగా వరద రావడం వల్ల స్పిల్‌వే ద్వారా నీరు వెలుపలకు ప్రవహిస్తోంది. అలాగే జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెంలోని కేకేఎం ఎర్రకాలువ జలాశయానికి వరద నీరు పోటెత్తుతోంది. ఈ ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 83.50 మీటర్లు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 82.90 మీటర్లకు చేరినట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.

భారతీయ ఆరోగ్య రంగానికి పెనుసవాల్



మాట్లాడుతున్న జాతీయ ఫార్మసీ కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ మెంతుకుమార్

తాడేపల్లిగూడెం రూరల్: యాంటీ మైక్రోబయాల్ రెసిస్టెన్స్ అనేది భారతీయ ఆరోగ్య రంగానికి పెను సవాలుగా మారిందని జాతీయ ఫార్మసీ కౌన్సిల్ ప్రెసిడెంట్ డాక్టర్ మెంతు కుమార్ ఎం.పాటిల్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం, జాతీయ ఫార్మసీ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో వైద్యులతో పాటు ఫార్మసిస్ట్‌ల పాత్ర కూడా అత్యంత కీలకమైనదన్నారు. ప్రజలు వ్యాధుల నివారణకు అవగాహన లేకుండా అనవసరంగా మందులు వాడుతున్నారని, వారిలో చైతన్యం నింపి యాంటీబయోటిక్ వాడకాన్ని తగ్గించేలా చూడాల్సిన బాధ్యత ఫార్మాసిస్ట్‌లపై ఉందన్నారు. ప్రతి ఫార్మసీ విద్యా సంస్థ కనీసం 10 పరిశ్రమలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకునేలా చేయడం ఫార్మసీ కౌన్సిల్ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఫార్మసీ కౌన్సిల్ ఐసీటీ అధ్యక్షుడు డాక్టర్ పి. సత్యమూర్తి, పిసిఐ సెంట్రల్ కమిటీ సభ్యుడు డాక్టర్ ఎస్.ఎల్.ఎన్. ప్రసాదరెడ్డి, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ అధ్యక్షుడు డి. శ్రీహరిరావు, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.వి. రత్నం ప్రసంగించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించగా, వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ, కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు, టెక్నికల్ డైరెక్టర్ చక్కా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

దీపావళి వెలుగులు.. భద్రతతోనే సంతోషాలు

- బాణసంచా దుకాణాల వద్ద నిబంధనలు పాటించాల్సిందే
- అగ్నిమాపకశాఖాధికారుల ఆదేశం



బైపాస్ రోడ్డులోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంతంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

భీమవరం: దీపావళి పండుగ వేళ బాణసంచా విక్రయాలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు వేగవంతమవుతున్నాయి. ధరలు పెరిగినప్పటికీ పండుగ ఉత్సాహంలో బాణసంచా కాల్చేందుకు యువత, పిల్లలు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట తదితర ప్రాంతాల్లో తాత్కాలిక బాణసంచా దుకాణాల ఏర్పాటుకు పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. ముఖ్యంగా భీమవరం పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో దాదాపు 30 దుకాణాల వరకు ఏర్పాటు చేస్తున్నారు. ఒకే చోట పెద్ద సంఖ్యలో షాపులు వెలుస్తుండటంతో అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

పాటించాల్సిన నిబంధనలివే

- దుకాణాలను గుడారాలు లేదా మండే స్వభావం కలిగిన వస్తువులతో నిర్మించకూడదు. ఒక దుకాణానికి మరొక దుకాణానికి మధ్య కనీసం 3 మీటర్ల ఖాళీ స్థలం ఉండాలి.
- షాపుల్లో నూనె దీపాలు, గ్యాస్ దీపాలు ఉపయోగించకూడదు. కొనుగోలుదారుల కోసం దుకాణాల వద్ద బాణసంచాను కాల్చి పరీక్షించే (టెస్టింగ్) ప్రయోగాలు ఎట్టి పరిస్థితుల్లోనూ చేయనివ్వకూడదు.
- తక్కువ పేలుడు స్వభావం కలిగిన ప్రమాణీకృత బాణసంచాను మాత్రమే విక్రయించాలి. స్థానికంగా తయారు చేసిన తారాజువ్వలు, చిచ్చుబుడ్లు, తాటాకు టపాకాయలు, నార బాంబులతో పాటు గన్ పౌడర్, నైట్రేట్, క్లోరేట్, అల్యూమినియం మిశ్రమంతో కూడిన ప్రమాదకర మందుగుండు అమ్మకాలను పూర్తిగా నిషేధించారు.
- ప్రమాదం సంభవిస్తే అగ్నిమాపక వాహనం సులువుగా వచ్చి వెళ్లేలా రవాణా సదుపాయం ఉండాలి. ప్రతి దుకాణం వద్ద 9 లీటర్ల సామర్థ్యం కలిగిన నాలుగు ఫైర్ బకెట్లను ఏర్పాటు చేసి, రెండింటిలో పొడి ఇసుకను, రెండింటిలో నీటిని సిద్ధంగా ఉంచుకోవాలి.
- దుకాణాల సమీపంలో పొగతాగడాన్ని పూర్తిగా నిషేధించాలి. స్థానిక ఫైర్ స్టేషన్ ఫోన్ నంబర్‌తో పాటు అగ్నిమాపక శాఖ టోల్ ఫ్రీ నంబర్ 101, పోలీసు శాఖ టోల్ ఫ్రీ నంబర్ 100 లతో కూడిన ప్రదర్శన బోర్డులను అందరికీ కనిపించేలా తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



బాణసంచా విక్రయదారులు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. వ్యాపారులకు బాణసంచా తయారీకి ఎలాంటి అనుమతులు లేవు. కాబట్టి అనుమతి పొందిన సంస్థల నుంచి తెచ్చిన బాణసంచాను మాత్రమే అమ్మాలి. 18 ఏళ్లలోపు పిల్లలకు విక్రయించకూడదు. నిబంధనలను అతిక్రమించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం.

– కె. శ్రీనివాసరావు, జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపకాధికారి, భీమవరం

దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ సమావేశం



దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

అత్తిలి: దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ 2వ వార్షిక సర్వసభ్య సమావేశం శుక్రవారం అత్తిలిలో అసోసియేషన్ కార్యదర్శి యడ్లపల్లి సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర, జిల్లా స్థాయి సంఘాల రిజిస్ట్రేషన్, క్రీడాకారుల వివరాల అప్‌డేట్, గత ఏడాది క్రీడా కార్యక్రమాల సమీక్ష, రాబోయే వార్షిక క్రీడా క్యాలెండర్ రూపకల్పన, సౌత్ జోన్ టోర్నమెంట్ల నిర్వహణ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అలాగే అండర్–19 క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడం, బాలికా క్రీడాకారులకు ప్రత్యేక ప్రోత్సాహం అందించడం వంటి అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో 2026–27 సంవత్సరానికి వివిధ కమిటీలు బాధ్యతలను నియమించారు. గేమ్ డెవలప్‌మెంట్ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా సుగాలి మధుసూదన్‌నాయక్, టోర్నమెంట్ ప్రోగ్రామింగ్, సీఎస్‌ఆర్ యాక్టివిటీస్ డైరెక్టర్‌గా గాధంశెట్టి తేజ, సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా జి.కైలాష్, లాజిస్టిక్స్ కమిటీ చైర్మన్‌గా కన్నూరి సురేష్, అంపైరింగ్ కమిటీ చైర్మన్‌గా రాజపుట్ నాగేంద్రసింగ్, స్కోరర్ కమిటీ చైర్మన్‌గా దాసం దుర్గారావు ఎన్నికయ్యారు. జోనల్ కోఆర్డినేటర్లుగా సౌత్ జోన్‌కు రామాంజుల నాయక్, సెంట్రల్ జోన్‌కు సుబ్బయ్య, నార్త్ జోన్‌కు బి.రామ్కృష్ణ, సలహాదారులుగా యడ్లపల్లి అయ్యప్పస్వామి, శరకణం పద్మారావు, మైపాల శ్రీనివాసు, అసోసియేషన్ మీడియా ఇన్‌చార్జిగా సిరిపురపు శ్రీహరి, అంబుడ్స్‌మన్ ఎథిక్స్ ఆఫీసర్‌గా అనుకుల రమేష్ తదితరులు ఎన్నికయ్యారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI)
స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచి : పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం జంక్షన్, విశాఖపట్నం - 530003.
Ph : 0891 - 2739126, Mobile : 98482 49289, E-mail: sbi.10077@sbi.co.in
అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ జి. నాగేశ్వరరావు, మొబైల్ నెం.97045 57261

Appendix – IV – A
[See Proviso to rule 8(6)]

స్థిరాస్తి అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(6) లోని నిబంధనలతో చదువుకోవలసిన సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద స్థిరాస్థుల అమ్మకము కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన)

సెక్యూర్డ్ క్రెడిటార్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి **ఋణగ్రహీత: మెస్సర్స్ వినయ్ అక్వా, ప్రొప్రయిటర్ : శ్రీ గుద్దటి వినయ్,** కేరాఫ్ : గుద్దటి ఏడుకొండలు, 24-11-26, దివ్య సాయి అపార్ట్‌మెంట్స్, బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ దగ్గర, శ్రీరాముపురం, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 534202. **శ్రీ గుద్దటి వినయ్ (వ్యక్తిగత హామీదారు),** కేరాఫ్ : గుద్దటి ఏడుకొండలు, 24-11-26, దివ్య సాయి అపార్ట్‌మెంట్స్, బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ దగ్గర, శ్రీరాముపురం, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 534202. వారు **(డిమాండ్ నోటీసు తేది.20.08.2025 ప్రకారం) తేది.19-08-2025** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తము **రూ.81,77,880/-** (అక్షరాల ఎనభై ఒక్క లక్షల డెబ్బై ఏడు వేల ఎనిమిది వందల ఎనభై రూపాయలు మాత్రమే) మరియు ప్రస్తుత బకాయి మొత్తము **తేది.04.11.2026** నాటికి **రూ. 1,05,02,211/-** (అక్షరాల ఒక కోటి ఐదు లక్షల రెండు వేల రెండు వందల పదకొండు రూపాయలు మాత్రమే) + **తేది.05.11.2026** నుండి భవిష్య వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి (తదుపరి జమలు ఉన్నచో తీసివేయబడును) వసూలు కొరకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారి వారిచే **నిర్మాణాత్మక స్వాధీనత** పరుచుకోబడిన బ్యాంక్ తనఖాలో ఉన్న దిగువ వివరించిన స్థిరాస్తి **"ఎక్కడ ఎలా ఉన్నది అలానే" ఏది ఎలా వుంటే అలానే" మరియు "అక్కడ ఏది ఉన్నదో అది" పద్ధతిపై" తేది.25-11-2026**న విక్రయించబడునని యావన్మంది ప్రజానీకమునకు మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీతలు మరియు హామీదారులకు ఇందుమూలముగా సూచించటమైనది.

బిడ్డర్లు వేలం తేదీకి ముందే https://baanknet.com/eauction-psb/x-login లో అనుసరించే విధానం ప్రకారం, అవసరమైన KYC పత్రాలు మరియు రిజిస్ట్రేషన్ ఫీజును సమర్పించి, అదే లింక్ https://baanknet.com/eauction-psb/x-login ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలి.

బహిరంగ ఇ-వేలం తేదీ & సమయం : 25-11-2026, ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥ 04.00 గం॥ల వరకు (ప్రతీ బిడ్‌కు 10 ని॥ల అపరిమిత పొడిగింపుతో)

ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ.)	ధరావత్తు ధర (రూ.)	బిడ్ పెంపుదల (రూ.)	తనిఖీ తేది మరియు సమయం
శ్రీ గుద్దటి వినయ్, తండ్రి : ఏడుకొండలు గారిచే తనఖా పెట్టబడిన స్థిరాస్తి: పశ్చిమగోదావరి జిల్లా, కాళ్ళ మండలం, సీసలి గ్రామం, జై లక్ష్మీ ఫ్యాక్టరీ రోడ్డు & సాయి బాబా గుడి రోడ్డు దగ్గర, సర్వే నెం.243/3సి/1 లోని 25.00 సెంట్లు లేదా 1258.28 చ॥గ॥లు విస్తీర్ణం గల ఖాళీ భూమి యావత్తు ఆస్తి ఉండి ఎస్ఆర్ఓ, డాక్యుమెంట్ నెం.2536/2021, తేది.15.12.2021 ప్రకారం శ్రీ గుద్దటి వినయ్, తండ్రి : ఏడుకొండలు గారి పేరున కలదు. ఆస్తికి హద్దులు : తూర్పు : రామాయణం నాగ విష్ణు సతీష్ గారి ఖాళీ భూమి, పడమర : గ్రీన్ వ్యూ స్థలం, దక్షిణం: ఇతరుల ఫిష్ ట్యాంక్, ఉత్తరం : ఉమ్మడి దారి కొరకు విడిచిపెట్టిన 33 అ॥ల గ్రావెల్ రోడ్డు.	65,00,000/-	6,50,000/-	25,000/-	09-11-2026 నుండి 24-11-2026 వరకు, ఉ॥10 గం॥ల నుండి సా॥ 04. గం॥ల వరకు

ఎన్‌కంబరెన్స్ (జంఝాటములు): అధీకృత అధికారి యొక్క ఉత్తమ జ్ఞానం మరియు సమాచారం మేరకు, బ్యాంకుకు ఎటువంటి ఎన్‌కంబరెన్స్ ఉన్నట్లు నివేదించబడలేదు. బిడ్ సమర్పించడానికి ముందే, వేలానికి ఉంచిన ఆస్తుల ఎన్‌కంబరెన్స్, టైటిల్ (యాజమాన్య హక్కులు) మరియు సదరు ఆస్తిపై ప్రభావం చూపే క్లెయిమ్‌లు/ హక్కులు / బకాయిల గురించి వేలంలో పాల్గొనబోయే బిడ్డర్లు స్వంతంగా స్వతంత్ర విచారణలు చేసుకోవాలి. ఈ ఇ-వేలం ప్రకటన బ్యాంకు యొక్క ఎటువంటి నిబద్ధతను గానీ లేదా ప్రాతినిధ్యాన్ని గానీ కలిగి ఉండదు మరియు కలిగి ఉన్నట్లు పరిగణించబడదు. బ్యాంకుకు తెలిసినా లేదా తెలియకపోయినా, ప్రస్తుతం ఉన్న మరియు భవిష్యత్తులో వచ్చే అన్ని ఎన్‌కంబరెన్స్‌తో కలిపి ఈ ఆస్తులు విక్రయించబడుతున్నాయి. ఎలాంటి మూడవ పక్షం (మూడవ పార్టీ) క్లెయిమ్‌లు/ హక్కులు / బకాయిలకు అధీకృత అధికారి లేదా సెక్యూర్డ్ క్రెడిటార్‌లు ఏవిధంగానూ బాధ్యత వహించరు. TDS / GST / ఇతర పన్నులను కొనుగోలుదారుడే భరించాలి. అలాగే వర్తించే స్టాంప్ డ్యూటీలు / అదనపు స్టాంప్ డ్యూటీ / బదిలీ ఛార్జీలు, ఫీజు మొదలైనవాటిని, మరియు అన్ని రకాల చట్టబద్ధమైన / చట్టబద్ధంకాని బకాయిలు, పన్నులు, రేట్లు, అసెస్మెంట్ ఛార్జీలు, ఫీజులు మొదలైన వాటిని కూడా కొనుగోలుదారుడే భరించాల్సి ఉంటుంది.

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క వెబ్ సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices లో ఏర్పాటుచేసిన లింక్‌ను రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, ఇయండి, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీస్ ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్ : https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91 - 8291220220, Mail ID : support.baanknet@psballiance.comను లేదా CM/Case Lead Officer : 97045 57261 & City Case Officer : 98482 49289 వారిని సంప్రదించవచ్చును.

ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 194-1A ప్రకారం అమ్మకంలో భాగంగా అమ్మకం విలువ రూ.50,00,000/- (యాభై లక్షల రూపాయలు) మరియు అంతకంటే ఎక్కువ ఉన్నచో సదరు మొత్తముపై TDS @ 1% వర్తిస్తుంది. కావున సఫలీకృత బిడ్డర్/ కొనుగోలుదారు గవర్నమెంట్ గైడ్‌లైన్స్ ధర లేదా అమ్మకం ధరలో ఏది ఎక్కువైతే దానిలో 1% TDSను తగ్గించుకొని సదరు మొత్తమును ఆదాయపు పన్ను డిపార్ట్‌మెంట్ నందు జమచేయవలెను మరియు సదరు ఒరిజినల్ TDS సర్టిఫికెట్‌ను బ్యాంకు వారికి సమర్పించవలెను.

తేది:04-11-2026, ప్రదేశం: విశాఖపట్నం — సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సాక్షి క్లాసిఫైడ్స్



■ హనుమాన్ జంక్షన్ దగ్గర మల్లవల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో సెక్యూరిటీ గార్డ్స్ 17 వేలు + PF + ESI, గన్ మెన్ 30 వేలు + PF + ESI, రూమ్‌ఫ్రీ ✆ 96423 13999, 88014 97437 [B-387]

■ యూనిటీ హోంకేర్: విజయవాడ/ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్స్‌ను 24/7 చూసుకొనుట కు వర్కర్స్/నర్సులు కావలెను. ఏజ్: 20-50. ఫ్రీ వసతి,భోజనం.జీ: 18K-20K.Ph: 8121541212 [H-783559]

■ హాస్పిటల్స్ నందు కాంట్రాక్టు & ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఫిమేల్ స్టాఫ్‌నర్స్ అ.కా.ను. అసిస్టెంట్స్, ANM, GNM, MLT, DMLT, Lab జీ:25K to 29K. వాట్సాప్ 7989082411 [H-805474]

■ బంటుమిల్లిలో ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు సెక్యూరిటీ స్టాఫ్ కావలెను. 8 గంటల డ్యూటీ. కాంటాక్ట్ నెంబర్ ✆ : 9493833958 [R-1289730]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.